

వీసీల నియామకానికి పోటాపోటీ

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని వర్సిటీల్లో వీసీల నియామకానికి పోటాపోటీ నెలకొనడం సర్వత్రా చర్చనీయాంశమైంది. - 6లో



వైభవోత్సవం!

తుమ్మలగుంటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. - 6లో



నిబంధనలకు పాతర..!

సైదాపురంలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. విలువైన ఖనిజాన్ని రాత్రికి రాత్రే తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. - 6లో

న్యూస్‌రీల్

14 నుంచి భారీ వర్షాలు!

తిరుపతి అర్బన్: వాతావరణశాఖ ఇచ్చిన సూచనల మేరకు జిల్లాలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతోపాటు అన్ని విభాగాలకు చెందిన అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ముందే పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని సూచించారు. అవసరమైన మేరకు బియ్యం, కందిపప్పు తదితర సరుకులు ఇవ్వడానికి సివిల్ సప్లయ్ అధికారులు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. అలాగే అన్ని శాఖల అధికారులు ముందస్తుగా వారు చేపట్టాల్సిన జాగ్రత్తలను గుర్తుచేశారు.

స్కాలర్‌షిప్‌నకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

తిరుపతి అర్బన్: పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ రెన్యూవల్‌తోపాటు కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యం ఉందని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి చెన్నయ్య శుక్రవారం తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి సంబంధిత కళాశాల ప్రిన్సిపల్‌తో సంప్రదించి జ్ఞానభూమి పోర్టల్‌లో లాగిన్ అయితే పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ రెన్యూవల్‌తోపాటు కొత్త రిజిస్ట్రేషన్స్ చేసుకోవచ్చని సూచించారు. అర్హులైన పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 60,775 మంది స్వామివారిని దర్శించుకోగా 25,288 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.88 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఎల్ఎల్‌బీ ఫలితాల విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఎల్ఎల్‌బీ తృతీయ, ఐదు సంవత్సరాల కోర్సుకు ఈ ఏడాది జూన్‌లో జరిగిన మొదటి సెమిస్టర్ ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం.దామ్లానాయక్ తెలిపారు. ఫలితాల కోసం విద్యార్థులు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

తేరు.. భక్తజన హోరు



రథోత్సవానికి పోటెత్తిన భక్తులు



బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు శుక్రవారం ఉదయం ఉభయదేవేరులతో కలిసి మలయప్పస్వామి రథంపై విహరిస్తూ కనువిందు చేశారు. స్వామివారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. రాత్రి కల్కి అవతారంలో కలియుగ వైకుంఠనాథుడు అశ్వవాహనంపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు.

- రథంపై విహరించిన మలయప్ప
- అశ్వ వాహనంపై కల్కి అవతారంలో దర్శనమిచ్చిన శ్రీనివాసుడు
- నేడు చక్రస్నానం, ధ్వజావరోహణం

తిరుమల: తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఎనిమిదో రోజు శుక్రవారం ఉదయం ఉభయదేవేరులతో కలసి మలయప్ప స్వామి రథంపై విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. శ్రీనివాసుడి దివ్యమంగళ రూపాన్ని దర్శించి భక్తులు పునీతులయ్యారు. రథోత్సవం ప్రారంభమైన కొంత సేపటికి రథం ఆలయ సమీపంలోని కొలువు మండపం వద్దకు చేరింది. అక్కడి నుంచి ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది రథాన్ని జాగ్రత్తగా ముందుకు కదిలించారు. నాలుగు మాడవీధుల్లో రథం ముందుకు కదిలేటప్పుడు అష్టదిక్పాలకులకు పూజలు నిర్వహించారు.

అశ్వ వాహనంపై తేజోమయుడు

శుక్రవారం రాత్రి కల్కి అవతారంలో అశ్వ వాహనాన్ని అధిరోహించి మలయప్ప తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



అశ్వవాహనంపై ఊరేగుతున్న మలయప్ప

మహిళా డాక్టర్ రథసారథి

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగిన రథోత్సవంలో ఓ మహిళా డాక్టర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తిరుమలలో కొన్ని కార్యక్రమాల్లో మీరాశీ వ్యవస్థ ఉంది. ఈ క్రమంలో రథోత్సవంలో రథ సారథులుగా ఐదు కుటుంబాల ప్రతినిధులు పాల్గొంటారు. ఈసారి రెడ్డెప్పగారి, మునెప్పగారి వంశానికి అవకాశం వచ్చింది. ఈ ఇద్దరి వంశం నుంచి ఎవరూ మగ పిల్లలు లేరు. ఈ క్రమంలో వారి కుమార్తె, డాక్టర్ ఖ్యాతి (న్యూరోసర్జన్) తమ వంశ పరంపరను కొనసాగించారు.



రథసారథిగా డాక్టర్ ఖ్యాతి



కళార్చన



సాంస్కృతిక వైభవం



చక్రస్నానానికి ఏర్పాట్లు పూర్తి



చక్రస్నానం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుమల: అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీనివాసుడి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శనివారం చక్రస్నానానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శ్రీ వరాహస్వామివారి ఆలయం వద్దగల స్వామి పుష్కరిణిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారికి, శ్రీ చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం, ఆ తర్వాత చక్రస్నానం నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పుష్కరిణిలో గ్యాలరీలు, స్నానఘట్టాలు ఏర్పాటుచేశారు. టీటీడీ భద్రతా సిబ్బందితోపాటు ఎస్పీఎఫ్ సిబ్బంది, ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. తిరుమలలో శుక్రవారం జరిగిన సెక్టోరల్ అధికారుల సమావేశంలో ఈవో శ్యామలరావు మాట్లాడుతూ గరుడసేవ విజయవంతానికి అధికారులందరూ అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మం పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సుల తనిఖీ

- ఒక బస్సు స్వాధీనం, మరో పది బస్సులకు అపరాధం



బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐలు

తిరుపతి మంగళం: దసరా రద్దీ నేపథ్యంలో ప్రైవేటు బస్సుల్లో అధిక చార్జీల వసూళ్లకు అడ్డుకట్ట వేయడానికి జిల్లా రవాణాశాఖాధికారి మురళీ మోహన్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈనెల 14వ తేదీ వరకు తనిఖీలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా హైదరాబాద్, బెంగళూరు నుంచి వచ్చే బస్సులను శుక్రవారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ దామోదర్‌నాయుడు, పీ.చంద్రశేఖర్, స్వర్ణలత, ఆంజనేయప్రసాద్ బృందం కరకంబాడి, ఆంజనేయపురం ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. ఆల్ ఇండియా పర్మిట్, త్రైమాసిక పన్ను చెల్లించని కారణంగా తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆరంజ్ ట్రావెల్ బస్సును స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన మరో పది బస్సులకు అపరాధ రుసుం విధించారు. రెండు రోజుల నుంచి జరుగుతున్న ఈ తనిఖీల్లో ఇప్పటివరకు వాహనదారులకు రూ.6 లక్షల వరకు జరిమానా విధించినట్టు వెల్లడించారు.

రక్షిద్దాం..చదివిద్దాం

తిరుపతి అర్బన్: బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత జిల్లా అధికారిణి జయలక్ష్మి సూచించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం తిరుపతి నగరంలోని బాలికల సదనంలో పిల్లలతో కలసి ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికను రక్షిద్దాం...బాలికను చదివిద్దాం అనే నినాదాంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బాల్యవివాహాలు చేసుకోవడం ద్వారా వచ్చే అనర్థాలను తెలియజేశారు.

వాటాలు.. వార్నింగ్‌లు!

తిరుపతి జిల్లాకు భారీగా మద్యం దరఖాస్తులు

- కొందరు భయపడి.. మరి కొందరు భయపడక..
- చివరి రోజు ఉత్కంఠంగా ముగిసిన మద్యం టెండర్లు
- తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరులో వారిదే పైచేయి

కూటమి నేతల జేబులు నింపే మద్యం టెండర్ల ప్రక్రియ ముగిసింది. ప్రభుత్వ మద్యం టెండర్లకు నోటిఫికేషన్ విడుదల చేసిన నాటి నుంచి శుక్రవారం అర్ధరాత్రి వరకు ఉత్కంఠభరితంగా సాగింది. వార్నింగ్‌లు.. ఒప్పందాల మధ్య టెండర్ల ప్రక్రియకు తెరపడింది. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కోరకంగా సాగిన టెండర్ల దరఖాస్తు ప్రక్రియలో తిరుపతి జిల్లా నుంచి ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది.



> ఎవరైనా టెండర్లు వేసుకోండి. నాకు అభ్యంతరం లేదు. షాపు దక్కించుకున్న వాడు నా వాటా నాకు పంపించాల్సిందే. పర్మిట్ రూమ్‌లు, బెల్టు షాపులు మావాళ్లే పెట్టుకుంటారు. నా మాట వ్యతిరేకిస్తే ఎలా వ్యాపారం చేస్తారో నేను చూసుకుంటా..
> **– తూర్పు నియోజకవర్గాల్లో ఇద్దరు ఎమ్మెల్యేల బెదిరింపులు**
>
> నియోజకవర్గంలో మద్యం దుకాణం ఏర్పాటుకు ఎంత ఖర్చయిందో చెప్పండి. అందులో సగం నేను చెల్లిస్తా. ప్రతి దుకాణంలో నా మనిషి ఒకరు ఉంటారు. మీరొకరని నియమించుకోండి. వచ్చిన ఆదాయంలో సగం సగం పంచుకుందాం.
> **– తూర్పు నియోజకవర్గంలో మరో ఎమ్మెల్యే హుకుం**

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో ఏ జిల్లాలో లేనన్ని మద్యం దుకాణాలు తిరుపతి జిల్లాలో ఏర్పాటు చేసుకునేందుకు కూటమి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. అందుకు తగ్గట్టే దరఖాస్తులు కూడా వచ్చాయి. మొత్తం 227 దుకాణాలకు శుక్రవారం రాత్రి 10.30 గంటల వరకు 3,887 దరఖాస్తులు దాఖలయ్యాయి. వీటి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.77.74 కోట్లు, చిత్తూరు జిల్లా విషయానికొస్తే రూ.44.82 కోట్ల ఆదాయం సమకూరింది. తిరుపతి అర్బన్‌లో 32 దుకాణాలకు వెయ్యికిపైగా దరఖాస్తులు దాఖలయ్యాయి. తిరుపతి రూరల్, రేణిగుంట, శ్రీకాళహస్తి, సత్యవేడులో భారీగా దరఖాస్తులు నమోదయ్యాయి.

నా దారి అడ్డదారి!

మద్యం దుకాణ టెండర్లలో ఎమ్మెల్యేలు నేరుగా పాల్గొనకపోయినా.. వారి అనుచరుల ద్వారా రంగంలోకి దిగారు. తూర్పు నియోజకవర్గం నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు టెండర్లు వెయ్యనివ్వకుండా అనేక మందిని అడ్డుకున్నారు. ఇంటికి పిలిపించి హెచ్చరికలు జారీచేశారు. శ్రీకాళహస్తి, గూడూరు నియోజకవర్గాల పరిధిలో టీడీపీ నేతలు టెండరుదారులను తీవ్ర స్థాయిలో బెదిరింపులకు గురిచేశారు. ఆ తర్వాత వెనక్కి తగ్గారు. 'ఎవరైనా వేసుకోండి. షాపు దక్కిన వ్యాపారి నా వాటా నాకు ఇచ్చేయండి. లేదంటే సజావుగా వ్యాపారం చేసుకోలేరు. అంతే కాదు.. షాపు వరకే.. పక్కన పర్మిట్ రూంలు, బెల్టు షాపులు మా ఇష్టం. అందులో మీరెవ్వరూ వేలు పెట్టడానికి వీల్లేదు' అని బెదిరించినట్లు సమాచారం. శ్రీకాళహస్తిలో ఓ టెండరుదారు నుంచి డీడీ లాక్కుని చించేసినట్టు సమాచారం. తూర్పు నియోజకవర్గానికి చెందిన ఓ ఎమ్మెల్యే మాత్రం వాటా అడినట్లు తెలిసింది. మద్యం దుకాణానికి ఎంత ఖర్చవుతోందో.. అందులో సగం తాను చెల్లిస్తానని, అదే విధంగా ప్రతి షాపులో తన మనిషి ఒకరిని నియమించి ఆదాయంలో చెరి సగం పంచుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. చంద్రగిరి పరిధిలో టెండర్లు ఖరారైన తర్వాత వ్యాపారులను పిలిచి నయానో, భయానో ఒత్తిడి చేసి వాటా రాబట్టుకోవచ్చని విడిచిపెట్టినట్లు సమాచారం. తిరుపతి నగరంలో అధికారపార్టీ నేతలు మద్యం వ్యాపారులపై ఒత్తిడి చేసి 32 దుకాణాలు ముగ్గురు నాయకులు పంచుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది.

భయం..భయం

ఈనెల 14న మద్యం టెండర్లు ఖరారు కానున్నాయి. తమ అనుమతి లేకుండా టెండర్లు వేసి షాపులు దక్కించుకున్న వారిని కొందరు ప్రజాప్రతినిధులు వేధింపులకు గురిచేసే అవకాశం లేకపోలేదనే ప్రచారం జరుగుతోంది. సంబంధిత టెండరుదారులను తీసుకెళ్లి బలవంతంగా షాపులు రాయించుకోవడం.. లేదా వాటాలు కోసం ఒత్తిడి చేయడం లాంటివి చేయొచ్చనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని టెండరుదార్లు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. కూటమి 'కిక్కు'కు బలవ్వాల్సిందేనా..? అంటూ నిట్టూర్చుతున్నారు.

సరిహద్దు ప్రాంతాల్లోనే డిమాండ్ ఎక్కువ

తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలైన సత్యవేడు, వరదయ్యపాళెం, పాలసముద్రం, గుడుపల్లి మండలాల పరిధిలోని మద్యం దుకాణాలకు అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. పాలసముద్రం మండలంలో ఒకే ఒక్క దుకాణానికి 82 దరఖాస్తులు రావడం విశేషం. వాకాడు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో 15 దుకాణాలకు గాను నేరుగా 264 దరఖాస్తులు రాగా.. ఆన్‌లైన్ ద్వారా 64 దరఖాస్తులు అందినట్టు అధికారులు చెబుతున్నారు. కేవలం ఈ ఒక్క ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోనే రూ.5 కోట్ల మేర ప్రభుత్వానికి ఆదాయం లభించడం గమనార్హం.

శుద్ధజలం..శివయ్యకే శఠగోపం!



శివయ్య గోపురం వద్ద ఏర్పాటు చేసిన శుద్ధజలం ప్లాంటు

శ్రీకాళహస్తి: భక్తుల కోసం ఏర్పాటు చేసిన శుద్ధజలాన్ని కొందరు అక్రమార్కులు రాత్రికి రాత్రే అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు సైతం పట్టించుకోకపోవడం అక్రమార్కులకు మరింత కలిసి వస్తోంది. వివరాలు.. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు పరిశుద్ధమైన నీటినందించాలని దాతలు సంకల్పించారు. ఇందులో భాగంగా శివయ్య గోపురం నుంచి బయటకు వచ్చే మార్గంలో ఒకటి, ఆలయ దక్షిణ గోపురం సమీపంలో మరొకటి శుద్ధ జల కేంద్రాలను దివీస్ లేబొరేటరీస్ సంస్థ గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసింది. అయితే రాత్రి పది గంటలు దాటిన తర్వాత ఈ మినరల్ వాటర్ ప్లాంట్లలోని నీటిని కొందరు దళారులు పట్టుకుని వ్యాపారానికి వినియోగించుకుంటున్నారు. ఆ ప్రాంతంలోని సెక్యూరిటీ సిబ్బంది సైతం వారిని అడ్డుకోకపోవడం కొసమెరుపు. మరికొందరైతే అక్కడే ముఖం, కాళ్లు కడుక్కోవడం లాంటివి చేస్తున్నా మందలించడంలేదు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టిపెట్టాలని భక్తులు కోరుతున్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.77,850
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,090
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.92,500
రిటైల్ వెండి గ్రాము	రూ.95.50

క్లుప్తంగా

కంటైనర్ లారీ దగ్ధం



పాకాల: ప్రయాణిస్తున్న కంటైనర్ లారీలో మంటలు చెలరేగిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారి, పత్తిపాటివారిపల్లి సమీపంలో శుక్రవారం వేకువ జామున బెంగళూరు నుంచి విజయవాడకు షామియానా వస్తువులతో వెళ్తున్న లారీలో పెద్ద శబ్దం వచ్చింది. వెంటనే డ్రైవర్ కిందకు దిగి లారీని పరిశీలించాడు. అప్పటికే ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. డ్రైవర్ నీటితో ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో లారీ ఇంజిన్ పూర్తిగా దగ్ధమైంది. అనంతరం పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు.



తరలించేందుకు సిద్ధంగా మైకా క్వార్జ్ ఖనిజం





సైదాపురం మండలంలో దొరికే విలువైన తెల్లబంగారాన్ని కూటమి నేతలు రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందంటూ మూసివేసిన మైనింగ్‌లను అడ్డదిడ్డంగా నిర్వహిస్తూ కొందరు తమ కార్యకలాపాలను విచ్చలవిడిగా సాగిస్తున్నారు. ఈ చీకటి సామ్రాజ్యానికి కళ్లెం వేయాల్సిన మైనింగ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ అటువైపు కన్నెత్తి చూడడంలేదన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

నిబంధనలకు పాతర..
అక్రమార్కుల జాతర!

విచ్చలవిడిగా తరలివెళ్తున్న తెల్లబంగారం

- హైదరాబాద్ టూ చెన్నై వయా సైదాపురం
- రైల్వే కోడూరు పర్మిట్లతో మరో అక్రమరవాణా
- రాత్రి పూట ఇతర రాష్ట్రాలకు తరలింపు
- మైనింగ్ అనుమతులు లేకుండానే మాయం
- మామూళ్ల మత్తులో మైనింగ్‌శాఖ
- సైదాపురం మండలంలో ఇదీ పరిస్థితి

సాక్షి టాస్క్‌ఫోర్స్: సైదాపురం మండలంలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. హైదారాబాద్ టూ చెన్నై అంటూ క్వార్జ్ ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. పక్కనే ఉన్న శ్రీసత్యసాయి జిల్లాలోని రైల్వేకోడూరు పర్మిట్లతో ఈ ప్రాంతంలో లభించే ఖనిజాన్ని చెన్నైకి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చీకటి పడితే చాలు ఖనిజాన్ని లారీలు, టిప్పర్లలతో విచ్చలవిడిగా తరలించేస్తున్నారు.

అను'మతి'లేదు!

సైదాపురం మండలంలో దొరికే క్వార్జ్, ఫల్స్‌ఫర్, వర్‌ముఖ్‌లైట్ ఖనిజానికి విదేశాల్లో కూడా మంచి గిరాకీ ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్త జీవో విడుదల చేయాలనే ఉదేశంతో శ్రీపొట్టిశ్రీరాముల నెల్లూరు జిల్లాలో ఉన్న అన్ని గనులను మూసి వేసింది. అప్పటి నుంచి నేటికీ గనులను తవ్వేందుకు అనుమతి ఇవ్వలేదు. అయితే ఒక్క అమృతేష్ మైకామైన్‌కు మాత్రమే అనుమతి ఇచ్చింది. ఈ మైన్‌కు కూడా కేవలం ఫల్స్‌ఫర్ ఖనిజాన్ని టైల్స్ ఫ్యాక్టరీకి తరలించేందుకు అనుమతులు మంజూరు చేసింది. అయితే అక్రమార్కులు నిరాటంకంగా అక్రమరవాణా సాగిస్తున్నారు. హైదారాబాద్, రైల్వే కోడూరు అనుమతులతో ఈ ప్రాంతంలో లభించే విలువైన తెల్లరాయిని మరో చోటుకు తరలించేస్తున్నారు. ఇదిలావుండగా సుమారు 250కి పైగానే శ్రీపొట్టిశ్రీరాముల నెల్లూరు జిల్లాలో యార్డులున్నాయి. ప్రస్తుతం ఈ యార్డులను కూడా కూటమి ప్రభుత్వం మూసేసింది. కానీ కొందరు యార్డు యాజమానులు కూటమి నేతల అండదండలతో యథేచ్ఛగా పనులు చేస్తున్నారు. ఆయా యార్డుల నుంచి అక్రమంగా ఖనిజాన్ని రవాణా చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు.



రాత్రి పూట టిప్పర్లలో తరలిస్తున్న క్వార్జ్ ఖనిజం

కొందరికే పనులు?

అక్రమంగా కొందరు మైనింగ్ ఆపరేషన్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ గనుల్లో అనధికారికంగానే పనులు చేస్తున్నారు. కాగా ఆ మైనింగ్ పనులకు వెళ్లే పేదల బతుకులు దుర్భరంగా మారుతున్నాయి. ప్రమాదం జరిగితే పట్టించుకునే నాథుడే లేరు. అక్రమమైనింగ్ వల్ల లక్షలాది రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

రవాణా ఇలా..

సైదాపురం మండలంలో దొరికే ఖనిజాన్ని సైదాపురం–పొదలకూరు వయా వీరంపల్లి మీదుగా నెల్లూరు బైపాస్ మార్గం గుండా తరలిస్తున్నారు. కొందరైతే టిప్పర్లతో సైదాపురం వయా గూడూరుకు చేరుకుని బైపాస్‌లో యార్డులకు తోలి అక్కడి నుంచి చెన్నైకి తీసుకెళ్తున్నారు. పర్మిట్లు మాత్రం హైదరాబాద్ నుంచి తెప్పిస్తున్నారు. కొందరు ఖాళీ లారీలతో రైల్వే కోడూరు పర్మిట్ల ద్వారా ఇక్కడి ఖనిజాన్ని లోడ్ చేసుకుని బహిరంగంగానే చెన్నైకి తరలిస్తున్నారు.

అధికారుల మౌనం?

సైదాపురం మండలంలో చీకటిపడితే అక్రమ ఖనిజాన్ని తరతలిస్తున్నా పట్టించుకునేవారు లేరు. నెలవారి మామూళ్లు అందడంతోనే అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీనిపై సంబంధిత అధికారులను 'సాక్షి' వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఏ ఒక్కరూ స్పందించలేదు.

నిత్యం 500 టన్నుల తరలింపు?

సైదాపురం మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి చీకటి పడితే 500 టన్నుల క్వార్జ్, ఫల్స్‌ఫర్, వర్‌ముఖ్‌లైట్ ఖనిజాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అవి కూడా ఇతర రాష్ట్రాలకు సంబంధించి న పర్మిట్లతో బహిరంగంగానే తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. హైదారాబాద్ నుంచి చెన్నైకి ఖనిజాన్ని తరలించేందు పర్మిట్లు పొందిన వాటితో రోజూ 500 టన్నులకు పైగానే ఖనిజాన్ని తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో లభించే క్వార్జ్ ఖనిజం టన్ను రూ.30వేల నుంచి రూ.60వేల వర కు పలుకుతోంది. అలాగే క్వార్జ్ మైకా టన్ను రూ. 25 వేల నుంచి రూ.2లక్షల వరకు పలుకుతోంది.

విజ్ఞాన సమాజం ఆవిష్కరణే లక్ష్యం

- జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు



మాట్లాడుతున్న జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు

తిరుపతి కల్చరల్: విజ్ఞాన సమాజం ఆవిష్కరణే లక్ష్యంగా తిరుపతి జిల్లా రచయితల సంఘం నిరంతరం కృషి చేస్తుందని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 20 మండలాలతో పాటు నెల్లూరు జిల్లాలోని 14 మండలాలతో కలిపి మొత్తం 34 మండలాలతో కొత్తగా తిరుపతి జిల్లా ఏర్పడిందని, ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లాకు సంబంధించిన కవులు, రచయితలతో ఇటీవల జిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఈ నూతన కార్యవర్గంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న కవులు, రచయితలను భాగస్వామ్యం చేస్తూ సంఘం ద్వారా భాషాభివృద్ధి, సాహితీ విలువల పెంపు దిశగా కార్యక్రమాలను రూపొందిస్తామన్నారు. విద్యార్థుల్లో పుస్తక పఠనాన్ని ప్రోత్సహించేందుకు బాల సాహిత్యానికి సంబంధించిన పుస్తక ప్రచురణలను చేపట్టినట్టు వెల్లడించారు. కథ–కవిత వంటి ప్రక్రియలకు సంబంధించిన శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. ప్రముఖ రచయితలైన డాక్టర్ కేశవరెడ్డి, కలువకొలను సదానంద, కె.సభా, శంకరంబాడి సుందరాచారుల రచనలను పాఠకులకు అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తామన్నారు. అంతేకాక ఫేస్‌బుక్, యూట్యూబ్ చానళ్ల ద్వారా ప్రసారం చేయనున్నట్టు వెల్లడించారు. జిల్లా రచయితల సంఘంలో కవులు, రచయితలు సభ్యత్వం చేసుకోవాలని, డిసెంబర్ 20వ తేదీ లోపు సభ్యత్వ రుసుము రూ.1116ను చెల్లించాలని కోరారు. జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, కార్యదర్శి మన్నవ గంగాధరప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, కోశాధికారి ఏనుగు అంకమనాయుడు, రచయితలు పేరూరు బాలసుబ్రమణ్యం, యువశ్రీ మురళి పాల్గొన్నారు.

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి



చంద్రగిరి : మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

చంద్రగిరి: ఉరివేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు... సుమారు 32 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి రాయలపురం పంచాయతీ జాతీయ రహదారి సమీపంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గూడూరులో వృద్ధుడి ఆత్మహత్య

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని రేల్వే స్టేషన్ సమీపంలోని క్వార్టర్స్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు ఒకటవ పట్టణ పోలీసులు తెలిపారు. రైల్వే క్వార్టర్స్ వద్ద నుంచి దుర్వాసన వెలువడడంతో అటుగా వెళ్తున్నవారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఒకటవ పట్టణ సీఐ శేఖర్‌బాబుతోపాటు సిబ్బంది సంఘటనా స్థలం వద్దకు వెళ్లి పరిశీలించగా.. బ్లూకలర్ షర్టు ధరించిన సుమారు 60 ఏళ్ల వృద్ధుడు, కొత్త ప్లాస్టిక్ తాడుతో ఉరి వేసుకుని మృతిచెంది ఉండడం గుర్తించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

భార్యను కిడ్నాప్ చేశారని ఫిర్యాదు

వెంకటగిరి రూరల్: తన భార్యను గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కిడ్నాప్ చేశాడని బాధితుడు దట్టం గురవయ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుని కథనం.. వెంకటగిరి రూరల్ మండలం, చిన్నన్నపేటకు చెందిన దట్టం గురవయ్య, తిరుమలమ్మ(30) భార్యాభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరు వెంకటగిరి పట్టణంలోని ఓ కాంప్లెక్స్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో ఈనెల 1వ తేదీన కూలి పనులకని వెళ్లిన తిరుమలమ్మ మళ్లీ ఇంటికి రాలేదు. వారం రోజులుగా వెదికినా ఫలితం లేదన్నారు. అదే గ్రామానికి చెందిన పుట్ట గురవయ్య తన భార్యతో సన్నిహితంగా ఉండేవాడని, అతనే తన భార్యను కిడ్నాప్ చేసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. అంతేగాక గురవయ్య పార్లపల్లి గ్రామానికి చెందిన మరికొందరితో పరిచయం ఏర్పాటు చేసుకుని మహిళలను ట్రాప్ చేస్తున్నట్టు తెలిసిందన్నారు. ఈ మేరకు తనకు న్యాయం చేయాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన వెల్లడించారు.



కనులపండువగా శ్రీకల్యాణ వెంకన్న రథోత్సవం

- బ్రహ్మారథంపై ఊరేగిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు
- అశ్వవాహనంపై కల్కి అవతారంలో స్వామి దర్శనం

వైభవోత్సవం!



రథోత్సవంలో ఆశీనులై భక్తులను అనుగ్రహిస్తున్న స్వామి, అమ్మవార్లు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు శుక్రవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు బ్రహ్మరథంపై ఊరేగుతూ కనువిందు చేశారు. గోవింద నామస్మరణలతో బ్రహ్మరథాన్ని భక్తులు ముందుకు లాగుతుండగా స్వామి, అమ్మవార్లు అభయ హస్తంతో దీవెనలను అందించారు. ఆలయం నుంచి బయలుదేరిన బ్రహ్మరథంపై ఉప్పు, మిరియాలు చల్లుతూ భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ప్రధాన ఆలయం నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరిన స్వామి వారి బ్రహ్మరథం 11.30 గంటలకు తిరిగి ఆలయం వద్దకు చేరింది.

అశ్వవాహనంపై కల్కి కటాక్షం

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారు అశ్వవాహనంపై కల్కి అవతారంలో శుక్రవారం రాత్రి భక్తులను అనుగ్రహించారు. ఈ వాహన సేవల్లో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, లక్ష్మీ దంపతులు, కుమారులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డితో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బ్రహ్మోత్సవాల్లో ఘుమఘుమలు

తుమ్మలగుంట బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి కళాకారులు పెద్ద ఎత్తున తరలి రావడంతో వారందరికీ మూడు పూటలా భోజన వసతి ఏర్పాటు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు చెవిరెడ్డి దగ్గరుండి వారందరికీ రుచికరమైన వంటకాలతో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనాన్ని నిరంతరాయంగా పంపిణీ చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం నుంచి పసందైన వంటకాలతో ఆహారాన్ని అందిస్తున్నారు.



అన్నదానం చేస్తున్న గ్రామస్తులు

నేడు చక్రస్నానం

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదో రోజు శనివారం ఉదయం 6 నుంచి 9 గంటల మధ్యన చక్రతాళ్వార్‌కు అభిషేకం నిర్వహించిన పుష్కరిణిలో చక్రస్నానం చేయించనున్నారు.

- గతంలో ఎన్నడూ లేనివిధంగా పోటీ
- ప్రయత్నాలు ముమ్మరం చేసిన ఆశావహులు
- విజయవాడలో తిష్టవేసి నాయకులను ప్రసన్నం చేసుకుంటున్న వైనం
- నామమాత్రపు పాత్ర పోషించనున్న సెర్చ్ కమిటీ

వీసీల నియామకానికి పోటాపోటీ



ఎస్వీయూ పరిపాలనాభవనం

తిరుపతి సిటీ: జిల్లాలోని ఎస్వీయూ, మహిళా, ద్రవిడ యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న వీసీల నియామక ప్రక్రియ వచ్చే వారం ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న ఆశావాహులు విజయవాడలో తిష్ట వేసి నాయకులను ప్రసన్నం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. గత నెల 29వ తేదీ నాటికి వీసీ నియామకాలకు సంబంధించిన దరఖాస్తు గడువు ముగిసింది. పండుగ ముగిసిన వెంటనే వచ్చే వారం సెర్చ్‌కమిటీ తన ప్రక్రియను ప్రారంభిచనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

సెర్చ్ కమిటీది నామమాత్రపు పాత్రేనా?

వీసీల నియామాలకు సంబంధించి ఏర్పాటు చేయనున్న సెర్చ్ కమిటీ సభ్యుల ఎంపిక దాదాపు పూర్తయినట్లు తెలుస్తోంది. యూజీసీ నుంచి నామినీతో పాటు సంబంధిత వర్సిటీల నుంచి ఒకరు, గవర్నర్ నామినీ ఒకరు సభ్యులుగా ఉండనున్నారు. తమకు అనుకూలమైన వ్యక్తులనే ప్రభుత్వం సెర్చ్ కమిటీ సభ్యులుగా నియమించుకునే ప్రయత్నం చేసింది. వీసీ పోస్టులకు నెలకొన్న పోటీ, అందుకు తగ్గట్టు నాయకుల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకుని నిపుణులైన అభ్యర్థులను ఎంపిక చేయడం సెర్చ్ కమిటీకి తలనొప్పిగా తయారుకానుంది. సామాజిక వర్గాల సమీకరణ నేపథ్యంలో కూటమిలోని ప్రధాన పార్టీల నాయకులతో ఆశావహులు ఇప్పటికే అమ్యామ్యాలతో పాటు పలుకుబడిని ఉపయోగిస్తున్నట్లు సమాచారం. తిరుపతిలో జనసేన పార్టీ అధికారంలో ఉండడంతో తమ సామాజిక వర్గానికే వీసీ పదవులు దక్కాలంటూ ఆ పార్టీ అధిష్టానం ఎదుట బాహాటంగానే డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది.

నువ్వా..నేనా?

యూనివర్సిటీల చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున దరఖాస్తులు రాలేదని మేధావులు, ఉన్నత విద్యామండలి అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని ఏ వర్సిటీకీ గతంలో ఇంత పెద్ద సంఖ్యలో పోటీ లేదని చర్చ నడుస్తోంది. ఎస్వీయూ వీసీ పోస్టు కోసం 12 మంది రిటైర్డ్ ప్రొఫెసర్లు, 13 మంది ఇన్‌సర్వీస్ వర్సిటీ ప్రొఫెసర్లు, మరో 9 మంది ఇతర వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే పద్మావతి మహిళా వర్సిటీ వీసీ పోస్టు కోసం రిటైర్డ్ ప్రొఫెసర్లు ఏడుగురు, ఇన్‌సర్వీస్ ప్రొఫెసర్లు ఆరుగురు, ఇతర వర్సిటీలకు చెందిన ఐదుగురు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే ద్రవిడ వర్సిటీ వీసీ కోసం 11 మంది పోటీలో నిలిచారు. వీటితో పాటు ఒక్కో అభ్యర్థి జిల్లాలోని వర్సిటీలతో పాటు ఇతర వర్సిటీల కోసం మూడు, నాలుగు దరఖాస్తులను చేసుకున్నట్లు సమాచారం.